# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సేవా మార్గానికి శ్రీ సత్య సాయిబాబా ఆదర్శంగా నిలిచారని ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ కొనియాడారు.**

2. **శ్రీ సత్య సాయిబాబా పుట్టపర్తిని ఆధ్యాత్మికతకు, దైవత్వానికి కేంద్రంగా మార్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.**

4. **మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాల్సిన బాధ్యత ఉందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు.**

==========================

సేవా మార్గానికి శ్రీ సత్య సాయిబాబా ఆదర్శంగా నిలిచారని ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. పేద ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారని కొనియాడారు. లక్షల మంది ప్రజలను సత్య సాయిబాబా సేవా మార్గంలో నడిపించారని ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ పేర్కొంటూ..

వాయిస్ .. 34 సెకన్లు

శ్రీ సత్య సాయిబాబా పుట్టపర్తిని ఆధ్యాత్మికతకు, దైవత్వానికి కేంద్రంగా మార్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ఆయన ఈరోజు పాల్గొన్నారు. సమాజ సేవ, సమస్యకు పరిష్కారం, ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తి మార్గంతో కోట్ల మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేశారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెబుతూ..

వాయిస్ 31 సెకన్లు

పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, తమిళనాడు మంత్రి శేఖర్ బాబు పాల్గొని బాబా సమాధి వద్ద నివాళులర్పించారు.

అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

---------------------------

సినిమాల చిత్రీకరణకు అనువైన ప్రదేశాల్లో జమ్మూ–కాశ్మీర్ ఒకటని ప్రముఖ నటులు అనుపమ్ ఖేర్ పేర్కొన్నారు. గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం –ఇఫీలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుపమ్ ఖేర్ మాట్లాడుతూ.. దర్శకులు, నిర్మాతలు జమ్మూ–కాశ్మీర్‌లో సినిమాలు తీసేందుకు ముందుకు రావాలని కోరారు. భవిష్యత్తులో కాశ్మీర్ సృజనాత్మక ప్రాజెక్టులకు ప్రధాన కేంద్రంగా మారనుందని చెప్పారు.

---------------------------

అరటి ధరలు, కొనుగోళ్లపై ప్రతీ రోజూ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి శ్రవణ మాధ్యమ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమలో పండిన అరటిని మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు తరలించి అక్కడి మార్కెట్లలో విక్రయించాలని సూచించారు. అరటిని రైల్వే వ్యాగన్లలో ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2 లక్షల 4 వేల టన్నుల మొక్క జొన్నను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్స్ ను తిరుపతి జిల్లాలోని కార్మిక సంఘాలు స్వాగతిస్తున్నాయి. కొత్తగా అమల్లోకి వచ్చిన వేతనాల కోడ్ – 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్ –2020, సామాజిక భద్రత కోడ్–2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ వల్ల కార్మికుల భద్రత మరింత బలోపేతం అవుతుందని తిరుపతికి చెందిన కార్మిక సంఘం నేత కొండేటి గోపాల్ పేర్కొంటూ...

వాయిస్ .. 24 సెకన్లు

---------------------------

ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి నిన్న సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై గుత్తేదారులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సాలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రైనింగ్ పూర్తి చేసిన స్టాఫ్ నర్సులకు, ఏఎన్ఎంలకు సర్టిఫికెట్లు అందజేశారు.

---------------------------

తిరుపతి జిల్లా తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు సూర్యప్రభ వాహనంపై శ్రీ యోగ నారాయణ అలంకారంలో సిరుల తల్లి పద్మావతి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భజనలు, కోలాటాల నడుమ సూర్యప్రభ వాహన సేవను నిర్వహించారు. ఈరోజు సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ జరుగనుంది.

---------------------------

డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాల్సిన బాధ్యత ఉందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ – డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. విజయవాడ సింగ్ నగర్‌లో ఈగల్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియాలో భాగంగా డ్రగ్స్ వద్దు బ్రో, సైకిల్ తొక్కు బ్రో నినాదంతో సైకిల్ ర్యాలీని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సైకిల్ తొక్కుతూ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ బారిన పడి యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని మార్చడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కోరుతూ..

వాయిస్... 21 సెకన్లు

---------------------------

అస్సాంలోని గౌహతి వేదికగా దక్షిణాఫ్రికా, భారత్ జట్ల మధ్య రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. రెండో రోజు ఆట ప్రారంభించిన దక్షిణాఫ్రికా మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 404 పరుగులకు 7 వికెట్ల నష్టపోయింది. మార్కో జాన్సెన్ 49 పరుగులు, ముత్తుస్వామి 88 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు, రవీంద్ర జడేజా రెండు వికెట్లు, మహ్మద్ సిరాజ్, బుమ్రా చెరో వికెట్ తీశారు.

---------------------------

బంగాళాఖాతంలో అండమాన్ సమీపంలో నిన్న అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ రేపటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో ఈ నెల 28వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేది వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్...21 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================